సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 8 । జనవరి । 2023



గాలికొండ రహదారి నిర్మాణానికి అటవీశాఖ సర్వే IIలో



చట్టాలపై అవగాహన అవసరం IIలో

కోట గ్రామానికి ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ IIలో



గేట్లు ఎత్తేశారు..!

కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అటవీశాఖ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు ఎప్పుడూ తెరిచే ఉంటున్నాయి. అటవీ సంపద కాపాడేందుకు కంటికి రెప్పలా ఉండాల్సిన ఇవి మొక్కుబడిగా మారాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిని ఆసరాగా తీసుకుని అక్రమ కార్యకలాపాలు చాపకింద నీరులా గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతున్నాయన్న ఆరోపణలు లేకపోలేదు.

- అటవీ చెక్‌పోస్టుల్లో తనిఖీలు శూన్యం
- పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నా మొక్కుబడిగా విధులు
- అక్రమాలకు ఊతమిస్తున్న పనితీరు



పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లే రోడ్డులో వంతాడపల్లి చెక్‌పోస్టు వద్ద ఎత్తివేసిన గేట్లు

సాక్షి,పాడేరు: జిల్లాలోని పాడేరు అటవీ డివిజన్‌లో విలువైన కలపజాతులు ఉన్నాయి. అయితే అక్రమ కలప, బొగ్గు, ఇతర అటవీ సంపద అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పాడేరు అటవీశాఖ అధికారులు ప్రధాన రోడ్లలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు నామమాత్రంగానే దర్శనమిస్తున్నాయి.

మూడు చెక్‌పోస్టులున్నా..

పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు పోయే ఘాట్ రోడ్లలో వంతాడపల్లి, అరకులోయ నుంచి అనంతగిరి వెళ్లే మార్గంలో సుంకరమెట్ట, విశాఖ, విజయనగరం వెళ్లే రోడ్డులో చిలకలగెడ్డ ప్రాంతాల్లో అటవీ శాఖకు చెందిన మూడు చెక్‌పోస్టులు ఉన్నాయి. ఈ ప్రధాన రోడ్లలో పర్యాటకుల వాహనాలతో పాటు, ఆర్టీసీ, ఇతర ప్రైవేట్ వాహనాలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటాయి. * మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వాహనాలు కూడా పాడేరు, అనంతగిరి ఘాట్ రోడ్ల మీదుగా విశాఖ, రాజమహేంద్రవరం, విజయనగరం ప్రాంతాలకు కలప లోడ్ వాహనాలు వెళ్తుంటాయి.

పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నా..

అటవీ సంపద పరిరక్షణ, పలు కలపజాతులు అక్రమ రవాణాను అడ్డుకునే లక్ష్యంగా ఏర్పాటు చేసిన అటవీశాఖ చెక్‌పోస్టుల్లో సిబ్బంది పూర్తిస్థాయిలోనే ఉన్నారు. 24గంటల పాటు ఈ అటవీశాఖ చెక్‌పోస్టుల్లో గేట్లు దించి తనిఖీలు చేయాల్సిన సిబ్బంది కనీసం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. పగలు, రాత్రి వేళల్లో చిలకలగెడ్డ, సుంకమెట్ట, పాడేరుకు సమీపంలోని వంతాడపల్లి ప్రాంతాల్లోని మూడు అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కనీసస్థాయిలో కూడా జరగడం లేదు. ఏజెన్సీ నుంచి విలువైన కలప జాతులు వ్యాన్ల ద్వారా మైదాన ప్రాంతాలకు తరలిస్తుండడంతో పాటు, మైదాన ప్రాంతాల నుంచి అనేక మంది ఫర్నిచర్ వ్యాపారులు అత్యంత ఖరీదైన మంచాలు, ఇతర కలప వస్తువులను పాడేరు తరలిస్తూ భారీగా వ్యాపారం చేస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు పటిష్టంగా చేపట్టకపోవడం అక్రమ రవాణాకు మరింత ఊతమిస్తోందన్న ఆరోపణలున్నాయి.

విస్తృతంగా తనిఖీలు



పాడేరు అటవీ డివిజన్‌లో అడవులు పరిరక్షణ, అక్రమ కలప రవాణాపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. పాడేరు అటవీ డివిజన్ పరిధిలో మూడు ప్రధాన చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయి.ఈచెక్‌పోస్టుల ద్వారా 24గంటలు వాహనాల తనిఖీలకు తగిన ఆదేశాలిస్తాం. ప్రతి వాహనం తప్పనిసరిగా తనిఖీ చేయాల్సిందే. గేట్లు ఎత్తివేసి వాహనాల తనిఖీలను నిర్లక్ష్యం చేస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– వినోద్‌కుమార్, డీఎఫ్‌వో, పాడేరు

మత్స్యకారులకు సంక్షేమ పథకాలు

- కలెక్టర్ సుమిత్ కుమార్
- వివిధ రకాల యూనిట్లకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి,పాడేరు: మత్స్యశాఖ ద్వారా అందిస్తున్న సం**క్షేమ పథకాలను సద్విని**యోగం చేసుకోవాలని కలె**క్టర్ సుమిత్‌కుమార్** కోరారు. ఎస్సీ,ఎస్టీ మహిళా **మత్స్యకారులకు 60** శాతం, జనరల్, బీసీ **మత్స్యకారులకు 40 శా**తం రాయితీపై కేంద్ర, రాష్ట్ర **ప్రభుత్వాలు వివిధ** పథకాలు అమలుజేస్తు**న్నాయని ఆయన పేర్కొ**న్నారు. వెయ్యి హెక్టార్ల **విస్తీర్ణంలోని రిజర్వాయ**ర్లలో చేపల పెంపకానికి **రూ.3 లక్షలు, తాగు**నీటి జలాశయాల్లో కేజ్ **కల్చర్‌కు రూ.3 లక్షలు**, ఐస్ బాక్సుతో కూడిన మోటార్ సైకిళ్లకు రూ.75 వేలు, ప్రత్యక్ష చేపల విక్రయ కేంద్రం (నిర్దేశిత లేక మొబైల్) ఏర్పాటుకు రూ.20 లక్షలు, ఇన్సులేటెడ్ నాలుగు చక్రాల వాహనానికి రూ.20 లక్షలుగా నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. ఐస్ బాక్సుతో కూడిన మూడు చక్రాల వాహనానికి రూ.3 లక్షలు, చేపల రిటైల్ మార్కెట్‌హబ్ నిర్మాణానికి రూ.కోటి, చేపల కియోస్క్ నిర్మాణానికి రూ.50 లక్షలు, చేపల విలువ నిర్ధారణ, ఇతర యూనిట్ల ఏర్పాటుకు రూ.50 లక్షలుగా నిర్ణయించినట్టు ఆయన వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పొందేందుకు అసక్తి గల మత్స్యకారులు సమీపంలోని గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ–మత్స్యకార వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులతో పాటు సంబంధిత ప్రాజెక్టు రిపోర్టులు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. వివరాలకు 9701857618, 8143916878 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

అలరించిన సంక్రాంతి సంబరాలు

- ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థుల సందడి
- ఆకట్టుకున్న గిరిజన సంప్రదాయ నృత్యాలు



డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి సంబరాల సందడి



వంటకాల తయారీలో అధ్యాపకులు

సాక్షి,పాడేరు: అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు సంయుక్తంగా కళాశాల ఆవరణలో ముందస్తు సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. వీటిని ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్ ప్రారంభించారు. వేదిక వద్ద విద్యార్థినుల రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రత్యేక పూజలు అనంతరం బోగిమంటలతో సందడి చేశారు. వంటకాలను కట్టెల పొయ్యిపై తయారుచేశారు. గిరిజన ఆచార, సంప్రదాయానికి అద్దం పట్టేలా థింసా,డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు థింసా నృత్యం చేసి అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భరత్ కుమార్‌నాయక్ మాట్లాడుతూ సంక్రాంతి పండగను మైదాన ప్రాంతాలకు దీటుగా గిరిజన ప్రాంతాలలోను ఘనంగా నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.చలపతిరావు, అధ్యాపకులు డాక్టర్ పుష్పరాజ్, పి.కొండబాబు, నాగబాబు, సుందరిరాణి, సుజాత, ప్రసాదరావు, విజయలక్ష్మి, అనితాకుమారి, రాజు, అప్పారావు, సంధ్య, గోపాలకృష్ణ, అన్నపూర్ణ, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఉసిరి పప్పనకు రికార్డు ధర

కిలో రూ.80కు జీసీసీ కొనుగోలు



ఉసిరి పప్ప

సాక్షి,పాడేరు: పాడేరు, చింతపల్లి, రంపచోడవరం జీసీసీ డివిజన్ల పరిధిలోని ప్రధాన అటవీ ఫలసాయం ఉసిరిపప్పునకు జీసీసీ మద్దతు ధర పెంచింది.ఈ ఏడాది కిలో ఉసిరిపప్పును రూ.80తో కొనుగోలు చేయాలని జీసీసీ మార్కెటింగ్ విభాగం జనరల్ మేనేజర్ సురేంద్రకుమార్ ఆదేశాలిచ్చారు. ఈ విషయాన్ని పాడేరు డీఎం కురుసా పార్వతమ్మ తెలిపారు. గత రెండేళ్లుగా కిలో రూ.60 ధరతో ఉసిరి పప్పును జీసీసీ కొనుగోలు చేసేది. ప్రైవేట్ వ్యాపారులు కిలో రూ.50కు పరిమితం చేస్తున్నారు.అటవీ ప్రాంతాల్లో ఉసిరి చెట్లు అధికంగా ఉన్నాయి. గిరిజనులు ఈ సీజన్‌లో ఉసిరికాయలను సేకరించి, వాటిని ఉడకబెట్టి పప్పుగా తయారుచేసి బాగా ఆరిన తరువాత అమ్మకాలు జరుపుతారు. ఉసిరిపప్పునకు జీసీసీ మద్దతు ధర కిలోకి రూ.20 పెంచడంతో గిరిజనుల్లో ఆనందం నెలకొంది.

న్యూస్‌రీల్

సమయపాలన తప్పనిసరి

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్



బందవీధిలో ఆశ్రమ విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో రమేష్

జి.మాడుగుల: ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంపై దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని బందవీధి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యం, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రార్థన విధానాన్ని పరిశీలించారు. టెన్త్ పరీక్షలకు కేటాయించే గదుల్లో ఇప్పటినుంచి సదుపాయాలు సమకూర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించడమే కాకుండా వారి ఆరోగ్య పరిస్థితిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.

11,493 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

పౌరసరఫరాల శాఖ డీఎం గణేష్‌కుమార్

రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా శనివారం నాటికి 11,493 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాలశాఖ డీఎం గణేష్‌కుమార్ తెలిపారు. వీటి విలువ రూ. 23.20 కోట్లు కాగా ఇప్పటివరకు రూ. 5.18 కోట్ల మేర రైతుల ఖాతాల్లో నగదు జమచేశామన్నారు. జిల్లాలో 42 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ

రంపచోడవరం కేవీకేలో 19 నుంచి ఏర్పాటు

రంపచోడవరం: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు ఐదు రోజుల పాటు చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు మత్స్య విభాగం శాస్త్రవేత్త కె.వీరాంజనేయులు తెలిపారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి (ఎన్ఎఫ్‌డీబీ) హైదరాబాద్ వారి ఆర్థిక సహకారంతో శిక్షణ జరుగుతుందన్నారు. శిక్షణ పొందేందుకు ఆసక్తి గల మహిళలు ఈనెల 15 లోపు వారి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9553364265 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

కానిస్టేబుల్‌కు రివార్డ్



ఎస్పీ సతీష్‌కుమార్ చేతులమీదుగా రివార్డు అందుకుంటున్న భాస్కరరావు

అరకులోయ: స్థానిక పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధి నిర్వహణలో ఉత్తమ సేవలందిస్తున్న భాస్కరరావును ఎస్పీ సతీష్‌కుమార్, ఇతర అధికారులు అభినందించారు. ఆయనకు క్యాష్ రివార్డును ఎస్పీ అందజేశారు. చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిషోర్, అరకులోయ సీఐ జి.దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని

డ్వామా పీడీ రమేష్‌రామన్ IIలో



అన్యాయంగా చంపేశారు

- సుబ్బయ్య హత్యకు నిరసనగా ర్యాలీ
- మావోయిస్టుల తీరుపై ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న సుబ్బయ్య, రాజ్‌కుమార్ కుటుంబసభ్యులు

చింతూరు: మండలంలోని బుర్కనకోటకు చెందిన సోయం సుబ్బయ్యను మావోయిస్టులు హత్య చేయడాన్ని నిరసిస్తూ శనివారం గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన గిరిజనులు చింతూరు నుంచి చట్టి వరకు ర్యాలీ నిర్వహించి హత్యకు నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సుబ్బయ్య భార్య గౌరమ్మ, కూతురు రజనితో పాటు గతంలో మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన బండిరేవుకు చెందిన మడివి రాజ్‌కుమార్ భార్య రోజా మీడియాతో మాట్లాడారు. తమ భర్తలను పోలీసు ఇన్‌ఫార్మర్లుగా ముద్రవేసి మావోయిస్టులు అన్యాయంగా చంపారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

అమాయకులను చంపడమే సిద్ధాంతమా : ఎస్పీ సతీష్‌కుమార్

అమాయక గిరిజనులను పోలీసు ఇన్‌ఫార్మర్‌గా ముద్రవేసి చంపడమే మావోయిస్టుల సిద్ధాంతమా అని ఎస్పీ సతీష్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. హతమార్చిన వారిపై పోలీసు ఇన్‌ఫార్మర్ అంటూ ముద్ర వేస్తున్నారని, పోలీసుశాఖకు ఇన్‌ఫార్మర్ వ్యవస్థ ఉండదని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు కష్టం కలిగితే తమను ఆశ్రయిస్తారని, అలా తమకు సమాచారం వస్తుందని, ప్రజలంతా పోలీసు ఇన్‌ఫార్మర్లేనని ఆయన తెలిపారు. హత్యకు గురైన సుబ్బయ్య మిలీషియా సభ్యుడిగా ఉంటూ మావోయిస్టు పార్టీకి పనిచేశాడని, ప్రస్తుతం అతనిపై ఇన్‌ఫార్మర్ ముద్రవేసి చంపడం దారుణమని ఆయన తెలిపారు. గిరిజనుల సహకారం లేకపోవడం, వారి మాటలకు యువత లొంగకపోవడం వంటి సంఘటనలతో అభద్రతకు గురైన మావోయిస్టులు అమాయక ఆదివాసీలను హతమారుస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు.

12 మంది బీఎల్‌వోలకు మెమోలు



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి

రాజవొమ్మంగి: మండలంలో ఓటర్ల జాబితాల సవరణ, కొత్త ఓటర్లు నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యధోరణిని అవలంభిస్తున్న 12 మంది బూత్‌లెవెల్ అధికారులకు మెమోలు ఇచ్చినట్లు తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యాచారి తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. రాజవొమ్మంగి, వంచంగి, వాతంగి, లాగరాయి, దోనెలపాలెం, బడదనాంపల్లి పంచాయతీల పరిధిలోని బీఎల్‌వోలు మృతుల పేర్లను ఓటర్ల జాబితాలో తొలగించకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. ఈ విషయంపై సబ్ కలెక్టర్ శుభం బన్సల్ లిఖిత పూర్వకంగా వివరణ కోరుతూ సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ మెమోలకు ఆదేశించారని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోండి

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ
- 257 మందికి సేవలు



అంగన్‌వాడీ సిబ్బందికి తూనిక యంత్రాన్ని పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, వైద్యాధికారులు

హుకుంపేట: వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పెదగరువు బాలికల ఆశ్రమ పాఠశాలలో అమెరికాన్ ఇండో ఫౌండేషన్ సహకారంతో విశాఖ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను హుకుంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సిఫారసుతో జిల్లా ఆస్పత్రికి తరలించాలని ఆదేశించారు. పెదగరువు పరిసరాల ప్రాంతాలనుంచి వచ్చిన 257 మంది గిరిజనులకు వైద్యసేవలు అందించారు. రోటరీ క్లబ్ సహకారంతో 15 తూనిక యంత్రాలను అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయన పంపిణీ చేశారు. ఆదివారం ఉప్ప ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించే వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కొట్నాపల్లి గ్రామసచివాలయాన్ని సందర్శించారు. పంచాయతీ పరిధిలో సమస్యలను గ్రామసచివాలయ పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, అదనపు జిల్లా వైద్యాధికారి లీలాప్రసాద్, ఏటీడబ్ల్యూవో రజిని, కేజీహెచ్ నిపుణులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలిపులి

- మినుములూరులో 9
- చింతపల్లిలో 11.5
- అరకులోయలో 12.3 డిగ్రీల నమోదు



మంచు ముసుగులో జోలాపుట్టు జలాశయం



లంబసింగిలో దట్టంగా కురుస్తున్న మంచు



అరకులోయలో ఉదయం 9గంటలకు కమ్మేసిన మంచు తెరలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం ఉదయం పాడేరు మండలం మినుములూరు కాఫీబోర్డు వద్ద 9 డిగ్రీలు, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో 11.5 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 12.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. పొగమంచు అర్ధరాత్రి నుంచి దట్టంగా కురిసింది. అరకులోయ, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో ఉదయం 10 గంటల వరకు మంచుతెరలు వీడటం లేదు. సూర్యోదయం వరకు చలిగాలులు వణికిస్తూనే ఉన్నాయి. చిన్నారులు, వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు చలితీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. మన్యం వాసులతో పర్యాటకులు ఉన్ని దుస్తులు ధరించి, మంటలు కాగుతూ ఉపశమనం పొందుతున్నారు.

మంచు ముసుగులో లంబసింగి

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగిలో కొద్ది రోజులుగా మంచు దట్టంగా కురుస్తోంది. దీంతో ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు మంచు అందాలకు పరవశించి పోతున్నారు. శనివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మంచు కూడా దట్టంగా కురిసింది. సముద్ర మట్టానికి సుమారు 3,600 అడుగుల ఎత్తులో ఉండడంతో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఉదయం 10 గంటల వరకు పొగ మంచు తెరలు వీడటం లేదు. చెరువులవేనం కొండల్లో మంచు అందాలు పాలసంద్రాన్ని తలపించాయి.

ముంచంగిపుట్టు: ఆంధ్ర –ఒడిశా సరిహద్దు ప్రాంతంలో చలి తీవ్రత రోజు రోజుకు పెరిగిపోతోంది. మంచు తెరలు ఉదయం 10 గంటలైనా వీడటం లేదు. మంచు ముసుగులో జోలాపుట్టు జలాశయం అందాలు శనివారం ప్రకృతి ప్రేమికులను కనువిందు చేశాయి. తనివితీరా ఆస్వాదించారు. ఫొటోలు తీసుకుని పదిలపరచుకున్నారు.

క్లుప్తంగా

ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని

పెదబయలు: జిల్లాలో అర్హత గల ప్రతీ కుటుంబానికి ఉపాధి హామీలో 100 రోజుల పని దినాలు కల్పించాలని డ్వామా పీడీ రమేష్ రామన్ సూచించారు. శనివారం స్థానిక మండల ఉపాధి కార్యాలయంలో జరిగిన జరిగిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. మండలంలో 2020–2021, 2021–2022 ఆర్థిక సంవత్సరంలో 13,14వ విడత సామాజిక తనిఖీ చేపట్టామన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో 4024 పనులు చేపట్టగా వీటికి రూ.45.47 కోట్లు వెచ్చించినట్టు చెప్పారు. ఈ మేరకు సామాజిక తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. డీబీవో నిర్మల, ఏపీడీ గిరిబాబు, ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ బొంజుబాబు, మండల పరిషత్ ఏవో పూర్ణయ్య, ఏపీవో మూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూలీలు పాల్గొన్నారు.

గబ్బాడ చెరువులో చేపలు మృతి

నర్సీపట్నం: గబ్బాడ చెరువులో చేపలు మృతి చెందాయి. రైతుల ఆమోదంతో మత్స్యకారులు మూడేళ్లుగా చెరువులో చేపలను పెంచుతున్నారు. వేలాది చేపలు శనివారం మృతి చెందాయి. రూ.3 లక్షలు విలువ చేసే ఐదు టన్నుల చేపలు చనిపోయాయని మత్స్యకారు సొసైటీ సభ్యులు చెబుతున్నారు. చెరువును ఆనుకొని ఉన్న భూమిని ఆక్రమించిన రియల్టర్లను మత్స్యకారులు, గ్రామస్తులు అడ్డుకోవడం జరిగిందని, తమపై కక్ష పెంచుకుని రియల్టర్లు చెరువులో విషపూరితమైన పురుగుమందును కలపడం వల్లనే చేపలు చనిపోయాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని మత్స్యకార సొసైటీ సభ్యులు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



అడ్డతీగలలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రవీర్ బాంజ్ డియో



చింతపల్లిలో మాట్లాడుతున్న ఉమ్మడి విశాఖ జిల్లా సేవాసదన్ కార్యదర్శి బుల్లికృష్ణ

అడ్డతీగల: మెరుగైన సేవలతో చట్ట పరిధిలో విధులు నిర్వహించాలని రంపచోడవరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీర్ బంజా డియో అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు.ఇక్కడ రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సిబ్బంది పనితీరు, ఓపీ కేసులు తదతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పలు చట్టపరమైన అంశాలను వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆసుపత్రికి వచ్చే మెడికో లీగల్ కేసులకు సంబంధించి ఎటువంటి జాప్యం లేకుండా సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. ఎంఎల్‌సీ సమాచారంలో జాప్యం చేయడం వల్ల కేసులు వీగిపోయే అవకాశం ఉందన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ చట్ట పరిధిలో పనిచేయాలని సూచించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీలో ఉచిత న్యాయ సహాయ సేవలను సద్వినియోగం చేసుకునేలా మహిళా పోలీసు వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. దిశ చట్టాన్ని వివరించారు. న్యాయవాదులు కె.ఎస్.వి.రమణ, డి.శ్రీధర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరంలో న్యాయ విజ్ఞాన సదస్సులు

గంగవరం: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రంపచోడవరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీర్ బంజా డియో అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, చట్టాలపై అవగాహన పొందాలన్నారు. ఏఎస్ఐ రజాక్, ఎంఈఓ మల్లేశ్వరరావు, ప్రిన్సిపాల్ కృష్ణ, కోర్టు పీసీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి రూరల్: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి విశాఖ జిల్లా న్యాయ సేవాసదన్ కార్యదర్శి కేకే.బుల్లి కృష్ణ అన్నారు. శనివారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో విద్యార్థులు, గిరిజన రైతులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయ శాఖ ద్వారా ప్రతి ఒక్కరూ సలహాలు పొందేందుకు న్యాయబంధు యాప్‌ను వినియోగించు కోవాలని ఆయన కోరారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయ సేవా సంస్థ చైర్మన్ రెడ్డి ప్రసన్న, సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ అభిషేక్‌ను కలిసిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: అరకులోయ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. పాడేరు ఐటీడీఏలో పీవో గోపాలకృష్ణను ఎమ్మెల్యే శనివారం కలిశారు.నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు, మిషన్ కనెక్టు రోడ్ల పనులకు సంభందించిన పెండింగ్ బిల్లుపై పీవో తో ఎమ్మెల్యే చర్చించారు.

సబ్ కలెక్టర్ అభిషేక్‌తో ఎమ్మెల్యే సమీక్ష

పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్‌ను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కలిసి, పలు సమస్యలపై సమీక్షించారు. నియోజకవర్గంలో భూముల రిసర్వేను వేగవంతం చేయాలని, పలు ప్రాంతాల్లోని పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వం అమలుజేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకు మంజూరు చేయాలని సబ్‌కలెక్టర్‌ను ఎమ్మెల్యే పాల్గుణ కోరారు.



పీవో గోపాలకృష్ణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

గాలికొండ రహదారి నిర్మాణానికి అటవీశాఖ సర్వే

గూడెంకొత్తవీధి: మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా పేరొందిన గాలికొండ ప్రాంతంలో శనివారం చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ, పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు పర్యటించారు. గాలికొండ– పెదలంక రహదారి నిర్మాణానికి సంబంధించి ఉమ్మడిగా సర్వే చేపట్టారు. గాలికొండ నుంచి బత్తునూరు మీదుగా పెదలంక వరకూ 17 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి (ఆర్‌సీపీ)రూరల్ కనెక్టివిటీ ప్రోగ్రాం కింద రూ.15కోట్ల అంచనాతో నిర్మించడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.ఈరహదారి నిర్మాణం అంతా రక్షిత అటవీ ప్రాంతంలో ఉన్నందున అటవీశాఖ అభ్యంతరం తెలిపింది.దీనిపై ఉన్నతాధికారులు కసరత్తు చేసి అవసరమైన చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలోనే రహదారి నిర్మాణం వల్ల నష్టపోయే అడవులకు ప్రత్యామ్నాయంగా అనకాపల్లి జిల్లా కోటవురట్లలోని రాజుపేట వద్ద ఎనిమిది హెక్టార్ల భూమిని ప్రభుత్వం అటవీశాఖకు కేటాయించింది. దీంతో అటవీశాఖ లంకపాకలు పెదలంక గ్రామానికి రహదారి నిర్మాణానికి అనుమతులు ఇచ్చేందుకు సిద్ధపడింది. ఈనేపథ్యంలో శనివారం చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ రహదారి నిర్మించ తలపెట్టిన ప్రాంతాన్ని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో రేంజి అధికారి శ్రీనివాస్, పీఆర్ డీఈ కల్యాణ్‌కుమార్, ఏఈ ప్రకాష్‌లు పాల్గొన్నారు. రహదారికి సంబంధించిన మ్యాపులు సిద్ధం చేసి వాటిని ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేసిన తరువాత రహదారి నిర్మాణానికి అధికారికంగా అనుమతులు వస్తాయని డీఎఫ్‌వో తెలిపారు.

కోట గ్రామానికి ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ

డిపోమేనేజర్, ఏవోను సత్కరించిన స్థానికులు

వై.రామవరం: మండలంలోని కోట గ్రామానికి శనివారం గోకవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సర్వీసును పునః ప్రారంభించారు. రోడ్డు బాగులేని కారణంగా బస్సు సర్వీసును నాలుగేళ్లక్రితం నిలిపివేశారు. రోడ్డు మెరుగుపడటంతో గ్రామానికి చెందిన వ్యవసాయశాఖ ఏవో కింటుకూరి లక్ష్మణరావు, గ్రామ యువకులు బస్సు సర్వీసు పునరుద్ధరించాలని గోకవరం డిపో మేనేజరు రామన్నదొరను కోరారు. దీంతో సర్వీసు పునరుద్ధరించి శనివారం ప్రారంభించారు. రంపచోడవరం, కోట గ్రామాలమీదుగా మండలంలోని చవిటిదిబ్బలు వరకు డిపో మేనేజర్ బస్సులో ప్రయాణించి రూట్ చెకింగ్ చేశారు. ఈ సందర్భంగా బస్సులో గ్రామానికి వచ్చిన డిపోమేనేజర్ రామన్నదొర, ఏవో లక్ష్మణరావును స్థానికులు సత్కరించారు. గ్రామ యూత్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

టెన్త్‌లో నూరుశాతం ఫలితాలు లక్ష్యం



అనంతగిరి బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ట్రైబల్ వెల్ఫేర్ డీడీ కొండలరావు

ట్రైబల్ వెల్ఫేర్ డీడీ కొండలరావు

సాక్షి, పాడేరు: అన్ని గిరిజన విద్యాలయాల్లోని గిరిజన విద్యార్థులు టెన్త్‌లో నూరుశాతం ఫలితాలు లక్ష్యంగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బోధన కార్యక్రమాలను విస్తృతం చేయాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ ఐ.కొండలరావు ఆదేశించారు. ఆయన హుకుంపేట మండలం మజ్జివలస, అనంతగిరి మండలంలోని లుంగపర్తి, పెద్దబిడ్డ, అనంతగిరి–1, అనంతగిరి–2 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థుల సమ్మెటివ్–2 పరీక్షలను పరిశీలించారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థుల హాజరుపట్టీలు, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. స్టాక్‌రూమ్‌లలోని నిత్యావసర సామగ్రి, కూరగాయలు, ఇతర నిల్వలన్నింటిని పరిశీలించారు. ఆయా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతోను విద్యాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీడీ కొండలరావు మాట్లాడుతూ టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు కోసం ఉపాధ్యాయులు శ్రమించాలన్నారు. గిరిజన విద్యార్థులకు ఆశ్రమ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ఆశ్రమ పాఠశాలల నిర్వాహకులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అనారోగ్య సమస్యలు తలెత్తితే ఆయా విద్యార్థులను సకాలంలో ఆస్పత్రులకు తరలించి వైద్యసేవలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీడిమామిడిని సంరక్షించుకోవాలి

పందిరిమామిడి ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్

రంపచోడవరం: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఆదాయాన్ని ఇచ్చే జీడిమామిడిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని పందిరిమామిడి డాక్టర్ వైఎస్సార్ హార్టీ కల్చర్ యూనివర్సిటీ ఉద్యాన పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ కొప్పిశెట్టి రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని తామరపల్లి ఆర్‌బీకేలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో శనివారం జీడిమామిడి సస్యరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఏజెన్సీలో జీడిమామిడి పంట గిరిజనులకు ప్రధాన ఆదాయ వనరుగా ఉందన్నారు. పూత సమయంలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోకపోవడం, వాతావరణ అనుకూలించకపోవడం వలన గత ఏడాది దిగుబడులు బాగా తగ్గాయన్నారు. అయితే ఈ ఏడాది వర్షాలు బాగా పడడం వలన మొక్క పెరుగుదల బాగుందన్నారు. దీనికి సమాయనుకూలంగా చేపట్టవలసిన మందులు పిచికారీ చేస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు.సాధారణ పరిస్థితులలో జనవరి నుంచి ఫిబ్రవరి వరకు మూడు దఫాలుగా జీడిమామిడి పూత వస్తుందని, ఆ సమయంలో లేత చిగురు, పుష్ప గుచ్ఛాలను ఆశించే టీ దోమ రైతులను ఎక్కువగా నష్టపరుస్తుందన్నారు. ఆకు, పూత గూడు కట్టు పరుగు, ఆకు మడల పురుగు , కొమ్మ ,పుష్ప గుబ్బలను తొలిచే పురుగు, కాయ ,గింజ తినే పురుగుతామర పరుగులు, నల్లిపాటు తెగుళ్ల నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు ఆశించి నష్టం కలిగిస్తాయన్నారు. పూత లేదా మొగ్గ , కొత్త చిగురు కనిపించే సమయంలో ప్రోఫినో 1మీ.లీ.టీ లేదా, మోనోటక్రోటోపాస్ 1.6 మీ.లీ.ను, కర్బెడ్ జిమ్, మంకో జెట్ 1 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.పువ్వు వికసించిన సమయంలో పైరిపాస్ 2.5 మీ.లీ, కాఫర్ ఆక్సీ క్లోరేడ్ 3 గ్రాములు మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. రైతులు జీడిమామిడికి సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్న తమ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. తోటను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.



తామరపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అనకాపల్లిటౌన్: మండలంలో కూండ్రం గ్రామానికి చెందిన సీహెచ్.ప్రసాద్ పురుగు మందు సేవించి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ నరసింగరావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. భార్యాభర్తలైన ప్రసాద్, మంగలకు శుక్రవారం ఉదయం ఘర్షణ జరిగింది. దీంతో మనస్థాపం చెందిన ప్రసాద్ అదే రోజు మధ్యాహ్నం తన పొలంలోకి వెళ్లి పురుగు మందు సేవించాడని ఎస్ఐ చెప్పారు. సమాచారం తెలుసుకున్న భార్య మంగ పొలానికెళ్లి చూడగా అపస్మారకస్థితిలో ఉన్న భర్తను హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రసాద్ మృతి చెందినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.